వైభవంగా బోనాల పండుగ

షాబాద్, జూలై 31: షాబాద్ మండలంలోని తాళ్ల పల్లి గ్రామంలో పోచమ్మ బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుండి గ్రామస్తులంతా పోచమ్మ దేవాలయంలో పూజలు చేశారు. సాయంత్రం మహిళలు కొత్త బట్టలు ధరించి బోనాలు ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపు చేపట్టారు. ఈ బోనాల ఉత్సవాలు శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామం మార్మోగింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ : శివసత్తుల పూనకాలు...పోతరాజుల విన్యాసాలు.. డప్పుల దరువుల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం సమర్పించారు. బుధవారం మండల పరిధిలోని పెద్ద మంగళారం , బాకారం, అండాపూర్, మేడిపల్లి, కాశీమ్ బౌలి, కేతిరెడ్డి పల్లి గ్రామాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించి అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు.

మొయినాబాద్‌లో బోనాలతో మహిళలు

షాబాద్ మండలం తలపల్లిలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

మొయినాబాద్‌లో..

ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలి

కొత్తూరు, జూలై 31: కార్గో సేవలను వినియోగించుకోవాలని టీస్ ఆర్టీసీ ఆపరేషన్ టీం జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్ కోరారు. కొత్తూరు మున్సిపాలిటీలో బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టీస్ ఆర్టీసీ కార్గో సెంటర్‌ను ఆర్టీసీ ఆపరేషన్ టీం జిల్లా ఇన్‌చార్జి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి మండలంలో టీస్ ఆర్టీసీ కార్గో సెంటర్ తప్పనిసరిగా ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. కొత్తూరు పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల ఇక్కడ ఏర్పాటు చేసిన కార్గో సెంటర్‌ను మంచి ఆదరణ లభిస్తుందని ఆయన ఆకాంక్షించారు. పరిశ్రమలు, దుకాణాలకు అవసరమైన పార్సిల్స్‌తో పాటు దూరం ప్రాంతంలో చదువుకునే విద్యార్థులకు అవసరమైన తిను బండారాలను కూడా ఇక్కడ నుంచి పంపించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ డిపో సేల్స్ ఆఫీసర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు సిద్దార్థరెడ్డి, శ్రీకాంత్, కార్గో సెంటర్ నిర్వాహకుడు కొంగరి సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

కడ్తాల్, జూలై 31: ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ అందించాలని బీఆర్ఎస్ మండల నాయకుడు కంబాలపల్లి అంజయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో శ్రీలత, స్థానిక రైతులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ రైతులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. రుణమాఫీకి అర్హులైన రైతుల పేర్లు లిస్ట్‌లో లేకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ప్రతి రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, సిద్ధిగారి వెంకటేశ్, కృష్ణ, లచ్చానాయక్, రాములు, రాజు, బాబులు, రైతులు పాల్గొన్నారు.

డ్రైవర్లు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఇబ్రహీంపట్నం రూరల్: డిపో పరిధిలో తక్కువ ప్రమాదరేటును నమోదు చేసుకుని ఉన్నదని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకట నరసప్ప పేర్కొన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ వెంకట నరసప్ప హాజరై మాట్లాడుతూ ఈ సంవత్సరానికి గాను ఒకే ఒక ప్రమాదం నెలకొన్నదని చెప్పారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంచాల సీఐ బద్యా నాయక్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో క్రమశిక్షణతో కూడినడ్రైవింగ్ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, ఎం.ఎఫ్ సత్తయ్య ఎస్టిఐ వెంకట నాయక్ శేఖర్, సూపర్‌వైజర్లు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

బీజేపీ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి కావ్యను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

చేవెళ్ల రూరల్, జూలై 31 : అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని బీజేపీ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి కావ్య గౌడ్ అన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగికదాడులకు నిరసనగా బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన కావ్య కృష్ణ గౌడ్‌ను చేవెళ్ల మండల కేంద్రంలోని కందవాడ గ్రామంలో ఇంటి వద్ద గృహ నిర్బంధం చేసి చేవెళ్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కావ్య గౌడ్ మాట్లాడుతూ... ఇలాంటి అరెస్టులకు భయపడమని, మహిళలపై జరుగుతున్న అరాచకాలను మహిళా మోర్చా తీవ్రంగా ఖండిస్తుందన్నారు.

తెలంగాణ సామాజిక చైతన్య వేదిక

రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా రమేశ్

తుర్కయాంజాల్, జూలై 31 : తెలంగాణ సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర కో ఆర్డినేటర్ గా తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ కు చెందిన పట్నం రమేష్ నియామకం అయ్యారు. ఈ మేరకు బుధవారం జరిగిన తెలంగాణ సామాజిక చైతన్య వేదిక కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు స్వామి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్నం రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు ధన్యవాదములు తెలియజేశారు.

వన మహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలి

చేవెళ్ల రూరల్, జూలై 31 : శంకర్‌పల్లి మండల పరిధిలోని గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జూమ్ మీటింగ్ ద్వారా ఎంపీవో, ఏపీవోలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మొక్కల పెంపకం, వాటి సంరక్షణ తదితర వాటిపై శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

జన్వాడ గ్రామంలో మొక్కల పరిశీలన

శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ గ్రామంలో బుధవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని ఎంపీడీవో వెంకయ్య గౌడ్ పరిశీలించారు. మొక్కల సంరక్షణ, వాటి నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ సిబ్బంది, సెక్రటరీకి సూచించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం లక్ష్మణ్‌నాయక్, మాజీ సర్పంచ్

షాబాద్, జూలై 31: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదవీ విరమణలు తప్పనిసరిగా ఉంటాయని సర్దార్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ నాయక్, గ్రామ మాజీ సర్పంచ్ నరసింహులు అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు జంగయ్య, కృష్ణ కుమార్, సుశీల, శివ కుమార్, వరలక్ష్మి, రవీందర్ గౌడ్, కృష్ణయ్య, జహంగీర్, ఎల్లయ్య తదితరులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వర్తించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి, ఎంపీటీసీలకు సత్కారం

చేవెళ్ల టౌన్, జూలై 31: గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీటీసీల పాత్ర ఎంతో కీలకమని చేవెళ్ల గ్రామ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ కృష్ణయ్య, మాజీ సర్పంచ్ బండారి శైలజాఆగిరెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వేంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు వసంతం, గుండాల రాములును సన్మానించారు. అదేవిధంగా చేవెళ్ల నూతన పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రాఘవేందర్ కు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు దేవర సమతా రెడ్డి, మాజీ ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఆశ వర్కర్స్, గ్రామపంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో ఐక్యత చాటుతున్న సేవాలాల్ సేన రాష్ట్ర, జిల్లా నాయకులు

మంత్రివర్గంలో గిరిజనులకు అవకాశం కల్పించాలి

కడ్తాల్, జూలై 31: రాష్ట్ర మంత్రివర్గంలో గిరిజనులకు ప్రాతినిధ్యం లేకపోవడం శోచనీయమని, సమస్యల పరిష్కారానికి గిరిజనులంతా ఐక్యతగా ఉండాలని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ అన్నారు. బుధవారం కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌లో... గిరిజనుల హక్కుల సాధన, జాతి ఐక్యత, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణపై విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు జర్పుల శంకర్‌నాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంత్‌సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ పెంపునకు సంబంధించిన జీవో నెం. 33కు వెంటనే చట్టబద్ధత కల్పించాలన్నారు. కొత్తగా ఏర్పడిన గిరిజన పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలని, ఏజెన్సీ ప్రాంతంలో రద్దు చేసిన జీవో నెం.3ను వెంటనే పునరుద్ధరించాలని తెలిపారు. మంత్రివర్గంలో గిరిజనులకు చోటు కల్పించడంతోపాటు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం దక్కాలన్నారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధనకు గిరిజనులు ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఉపాధ్యక్షుడు కోట్యానాయక్, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, మాజీ సర్పంచ్ బిచ్చానాయక్, బిక్కునాయక్, రెడ్యానాయక్, దేవానాయక్, సీతారాంనాయక్, శ్రీనూనాయక్, మోహన్‌నాయక్, చంద్రునాయక్, ధర్మానాయక్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కడ్తాల్, జూలై 31: గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, ఆగస్టు 2న సచివాలయం ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నట్లు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ప్రకటించారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2019-24 వరకు పదవిలో ఉన్న సర్పంచ్‌లు అప్పటి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, ఆదేశాల మేరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టం జరిగిందని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు సైతం నెల నెల జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 2వ తేదీ ఉదయం 10 గంటలు, సచివాలయం ఎదుట నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

షాద్ నగర్ టౌన్, జూలై 31: అనారోగ్యంతో మృతి చెందిన షాద్ నగర్ కార్ మెకానిక్ శివ కుటుంబానికి కార్ మెకానిక్ యూనియన్ నాయకులు అండగా నిలిచారు. కార్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం శివ కుటుంబ సభ్యులకు రూ. లక్షా20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్, యూనియన్ నాయకులు హర్షవర్ధన్, జంగారెడ్డి, మధు, సునీల్, రాజశేఖర్, తిరుపతయ్య, శ్రీను, గణేశ్, ఇర్ఫాన్, ఉమర్, తరుణ్, సురేశ్, మధు, సుధాకర్, శివ, దామోదర్, రాజురెడ్డి, గోవింద్, మహేశ్, రాజశేఖర్, మురళి, వినయ్, నరేశ్, రాకేశ్, శ్రీకాంత్, రవి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

షాద్‌నగర్ : వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులతో పాటు మహిళా సంఘాల సభ్యులు భాగస్వామ్యం కావాలని కేశంపేట మండల ప్రత్యేక అధికారి రాజారత్నం అన్నారు. బుధవారం కేశంపేట మండల కేంద్రంలోని మండల పరిషత్ లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అనే నినాదంతో అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా డీఆర్డీఏ ప్రాజెక్టు మేనేజర్ ఐబీ స్వర్ణలత మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమం పై మహిళా సంఘాల సభ్యులకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రుణాలను అందించడంతోపాటు స్వయం ఉపాధి పొందేందుకు ప్రోత్సహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, ఏపీఎం భగవంత్, మహిళా సంఘాల సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

యాచారం, జూలై 31 : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీవో నరేందర్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య, తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీ రికార్డులను పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల రూరల్, జూలై 31 : 1991-96 సంవత్సరంలో చన్‌వెల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 33 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. బుధవారం చేవెళ్ల మండలంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకుని తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి

షాబాద్, జూలై 31: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిధిలోని తెలంగాణ మాడల్ స్కూల్ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. చెట్లు పెంచితేనే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని స్పష్టం చేశారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మధు, పంచాయతీ కార్యదర్శి అనిత, ఏపీవో వీరాసింగ్, ఆయా గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

మాడ్గుల, జూలై 31: మండలంలోని కొల్కులపల్లి గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ని ఏఎంసీ మాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలోని రాజీవ్ నగర్ తాండకు బీటీ రోడ్డు, సీసీ రోడ్లు, డైనేజీ నిర్మాణం, స్కూలు అభివృద్ధి, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు.

వెంకటేశ్వరకాలనీ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

పెద్దఅంబర్‌పేట, జూలై 31: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరులోని వేంకటేశ్వర కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బస్వారెడ్డి ఎన్నికయ్యారు. కాలనీ సంక్షేమ సంఘాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా ఆగేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా సత్యనారాయణరెడ్డి, లీగల్ అడ్వయిజర్‌గా చిరంజీవులు ఎన్నికయ్యారు. సంక్షేమ సంఘ కొత్త సభ్యులను కౌన్సిలర్ అనుపమ సుప్రసేన్ రెడ్డి అభినందించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తామని చెప్పారు.

రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోండి

షాద్ నగర్ టౌన్, జూలై 31: రైతు బీమా పథకానికి అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఫరూఖ్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 -25 సంవత్సరానికి గాను రైతు బీమా పథకానికి 59 సంవత్సరాలు లోపు రైతులు అర్హులన్నారు. రైతు బీమా పథకం కోసం పట్టాదారు ఆధార్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్ తప్పనిసరి అని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో AEO వద్ద ఈనెల 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

యాచారం, జూలై31: రైతు రుణమాఫీ కానీ రైతులు రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సందీప్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 డిసెంబర్ 12నుంచి, 2023డిసెంబర్ 9వరకు రుణమాఫీ పడని రైతులు మండల కేంద్రంలోని రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులు బ్యాంకు సేవింగ్ అకౌంట్ పాస్ బుక్ జిరాక్స్, క్రాప్ లోన్ అకౌంట్ స్టేట్‌మెంట్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, పొలం పట్టా పాస్ బుక్ జిరాక్స్ జతచేసి దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన ఉండాలి

ఆదిబట్ల, జూలై 31 : ఆన్‌లైన్ మోసాలు, మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని నాదర్గుల్ గ్రామంలోని శ్రీ వంశీధర్ స్కూల్ లో బుధవారం సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్ అబ్యూస్ గురుంచి పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజు, సైబర్ వారియర్ నేనావత్ శారద, స్కూల్ డీన్ గోదాలక్ష్మి, ప్రిన్సిపాల్ గోపాల కృష్ణ, మధుసూదన్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

షాద్ నగర్ : ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన షాద్ నగర్ మున్సిపాలిటీలో బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం సుమారు 25 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని యువకుడు షాద్ నగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఒంటిపై ఆకుపచ్చ రంగు టీ షర్ట్, నీలం కలర్ ప్యాంట్ తో పాటు అదనంగా రేయిన్ కోర్టు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. కుడి చేతి వేలు కు రాగి ఉంగరం ఉందని తెలిపారు. మృతదేహాన్ని షాద్ నగర్ సర్కార్ దవాఖానకు తరలించి కేసు నమోదు చేశామని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 98489 09426 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మొక్కలను సంరక్షించాలి

యాచారం, జూలై31: మండలంలోని నల్లవెల్లి, కే.సి తండా, యాచారం గ్రామాల్లో ఎంపీడీవో నరేందర్ రెడ్డి బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లో నాటిన పండ్ల మొక్కలు, ఉపాధి హామీ పథకం కింద నాటిన మొక్కలను సైతం ఆయన పరిశీలించారు. అదేవిధంగా పశువుల షెడ్లను సందర్శించి మాట్లాడారు. గ్రామాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

షాద్ నగర్ రూరల్, జూలై 31: ప్రతి గ్రామంలో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని షాద్‌నగర్ పట్టణ సీఐ విజయకుమార్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో సీసీ కెమెరాల ఆవశ్యకతపై గ్రామ నాయకులు, గ్రామస్తులతో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో మరింత నిఘాను పెంచే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, నేరాలను నియంత్రించేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ తేజస్విని, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, మాజీ సర్పంచ్ సాయిప్రసాద్, యాదయ్య పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్